సాక్షి
జగిత్యాల
సోమవారం । 2 । అక్టోబర్ । 2023



తల్లీబిడ్డలకు ఆరోగ్యమస్తు..!
జిల్లాలోని ధర్మపురిలో నిర్మించిన మాతాశిశు ఆస్పత్రి, జిల్లాకేంద్రంలో సమీకృత మార్కెట్లు అందుబాటులోకి రానున్నాయి.
8లో▸



సఖ్యత లేక.. సౌకర్యాలు కానరాక
కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో పాలక మండలి కొలువుదీరిన నాటి నుంచి ఈవో వెంకటేశ్‌తో సఖ్యత లేదనేది కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది.
8లో▸

గరిష్టం/కనిష్టం
30.0/26.0

వాతావరణం
వాతావరణం చల్లబడుతుంది. ఆకాశం మేఘావృతమై ఉంటుంది. కొన్నిచోట్ల చిరుజల్లులు కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్‌

పనులు త్వరితగతిన పూర్తి చేయాలి



హెలీప్యాడ్‌ పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్‌

ధర్మపురి: జగిత్యాల, ధర్మపురిలో ఈనెల 3న మంత్రి కేటీఆర్‌ పర్యటించనున్న నేపథ్యంలో అభివృద్ధి పనులు త్వరితగతిన పూర్తి చేయాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ దివాకర ఆదేశించారు. ధర్మపురిలో చేపడుతున్న ఏర్పాట్లను ఆదివారం పరిశీలించారు. పట్టణంలోని హెలీప్యాడ్‌, పైలాన్‌, మాతాశిశు సంరక్షణ ఆస్పత్రి, ప్రభుత్వ జూనియర్‌ కళాశాల మైదానంలో బహిరంగ సభ ప్రదేశాన్ని పరిశీలించారు. ఆయన వెంట మెట్‌పెల్లి ఆర్డీవో మధు, డీఎస్పీ రవీందర్‌, ఈఈ శ్రీనివాస్‌, మున్సిపల్‌ కమిషనర్‌ రమేష్‌ తదితరులున్నారు.

ఏర్పాట్లు పరిశీలించిన ఎస్పీ భాస్కర్‌



ఎస్పీ ఎగ్గిడి భాస్కర్‌ ఆదివారం సాయంత్రం భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. పోలీస్‌ అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.

ఘనంగా బొడ్డెమ్మ వేడుకలు



బొడ్డెమ్మ వేడుకల్లో మహిళలు

ధర్మపురి: పట్టణంలో ఆదివారం రాత్రి బొడ్డెమ్మ వేడుకలను ఘనంగా నిర్వహించారు. స్థానిక బ్రాహ్మణ వీధుల్లోని బొజ్జవారివీధి, పెద్దంబట్లవారి వీధుల్లో వారం రోజుల నుంచి మట్టి ప్రతిమలను ఏర్పాటు చేసి రోజుకో ఇంట్లో పూజలు నిర్వహించారు. జ్యేష్ఠాదేవిగా పిలువబడే బొడ్డెమ్మను సాగనంపి బతుకమ్మగా పిలువబడే లక్ష్మీదేవిని ఆహ్వానిస్తారని పురాణాల ద్వారా తెలుస్తోంది. ఇందులో భాగంగానే ముందుగా బొడ్డెమ్మ విగ్రహాన్ని నూతన పట్టువస్త్రాలు, ఆభరణాలతో అలంకరించి బ్యాండ్‌మేళాల మధ్య పట్టణ పురవీధుల మీదుగా ఊరేగింపుగా తీసుకెళ్లారు. అనంతరం గోదావరిలో నిమజ్జనం చేశారు.

ఎస్సారెస్పీలోకి 10,818 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో



ఎస్సారెస్పీ

జగిత్యాలఅగ్రికల్చర్‌: ఎస్సారెస్పీలోకి 10,818 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తోంది. ప్రస్తుతం ప్రాజెక్టులో నీటిమట్టం 1091.0 అడుగులతో 90.313 టీఎంసీలుగా ఉంది. కాకతీయ మెయిన్‌ కెనాల్‌కు 2500 క్యూసెక్కులు, లక్ష్మీ కెనాల్‌కు 200 క్యూసెక్కులు, సరస్వతి కెనాల్‌కు 300, వరదకాల్వకు 7000, మిషన్‌ భగీరథకు 152 క్యూసెక్కుల చొప్పున వదులుతున్నారు.

అంగన్‌వాడీల సమ్మె యథాతథం

కోరుట్ల: అంగన్‌వాడీ ఉద్యోగుల సమ్మె యథాతథంగా కొనసాగుతుందని అంగన్‌వాడీ వర్కర్స్‌ అండ్‌ హెల్పర్స్‌ జేఏసీ, సీఐటీయూ, ఏఐటీయూసీ నాయకులు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆర్థిక మంత్రి తన్నీరు హరీశ్‌రావు వేతనాల పెంపు అంశాన్ని సీఎంతో మాట్లాడుతానని, పీఆర్సీ ప్రకటించినప్పుడు అంగన్‌వాడీలకూ పెంచుతామని హామీ ఇచ్చారని, రిటైర్మెంట్‌ బెనిఫిట్స్‌ పరిశీలిస్తామన్నారని, స్పష్టమైన హామీ ఇవ్వకపోవడంతో సమ్మె కొనసాగించేందుకు నిర్ణయించామని పేర్కొన్నారు.

ఇథనాల్‌ పరిశ్రమ స్థానంలో వ్యవసాయ కళాశాల

వెల్గటూర్‌: వెల్గటూర్‌ మండలం స్తంభంపల్లిలో నిర్మించతలపెట్టిన ఇథనాల్‌ పరిశ్రమ స్థానంలో వ్యవసాయ కళాశాల ఏర్పాటుకు ఆదివారం జీవో విడుదలైనట్లు మంత్రి కొప్పుల ఈశ్వర్‌ తెలిపారు. స్తంభంపల్లి శివారులో 70 ఎకరాల విస్తీర్ణంలో కళాశాల నిర్మాణానికి ఈనెల 3న మంత్రి కేటీఆర్‌ చేతులమీదుగా శంకుస్థాపన చేస్తారని తెలిపారు.

ఏక్‌ రుపియా వాలా 2.0



- రెండేళ్లలో రూ.వందల కోట్లకు పడగలెత్తిన వ్యాపారి
- కరీంనగర్‌ నుంచి నేరుగా తమిళనాడుకు పీడీఎస్‌ రైస్‌
- సైకిళ్ల నుంచి గూడ్స్‌ రైళ్లలో తరలించే స్థాయికి ఎదిగిన వైనం
- రెండేళ్ల క్రితం డీజీపీ కార్యాలయం ఆగ్రహంతో అజ్ఞాతంలోకి..
- మిల్లర్లతో కుమ్మక్కై సీఎమ్మార్‌ బియ్యం కూడా ఎగుమతి
- 'పుష్ప' తరహాలో మహారాష్ట్ర, తమిళనాడుకు విస్తరించిన నెట్‌వర్క్‌

సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌: అడవిలో చెట్లు కొట్టుకునే కూలోడు అంతర్జాతీయ స్మగ్లర్‌గా ఎదిగిన కథ 'పుష్ప' సినిమా. వాస్తవానికి అలాంటి ఘటనలు నిజజీవితంలో జరగవు. కానీ.. ఉమ్మడి కరీంనగర్‌లో పీడీఎస్‌ బియ్యం కొనుగోలు చేసి.. అధిక ధరలకు ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే వ్యాపారిని చూస్తే నిజమే అనిపిస్తోంది. 'ఏక్‌ రూపాయ్‌వాలా' కోడ్‌ నేమ్‌తో అధికారులు ముద్దుగా పిలుచుకునే ఈ స్మగ్లర్‌ నెట్‌వర్క్‌ ఒకప్పుడు పాత కరీంనగర్‌ జిల్లాకే పరిమితం. నేడు ఇతర రాష్ట్రాలకు విస్తరించింది. రెండేళ్ల క్రితం ఉమ్మడి జిల్లా దాటి మహారాష్ట్రలో ఎంటర్‌ అయ్యాడు. ఆ సమయంలో అతడి దందా.. పీడీఎస్‌ బియ్యాన్ని రాష్ట్ర సరిహద్దులు దాటిస్తున్న తీరును 'సాక్షి' దినపత్రిక 'ఏక్‌ రూపాయ్‌వాలా' శీర్షికన వరుస కథనాలు ప్రచురించింది. ఈ కథనాలపై డీజీపీ కార్యాలయం స్పందించి దాడులకు ఆదేశించింది. అప్పటి కరీంనగర్‌ సీపీ సత్యనారాయణ నేతృత్వంలో టాస్క్‌ఫోర్స్‌ బృందాలు వరుస దాడులతో విరుచుకుపడ్డాయి. పీడీఎస్‌ బియ్యాన్ని అక్రమంగా తరలిస్తున్న పలువురిని బైండోవర్‌ కూడా చేశాయి. దీంతో కొంతకాలంపాటు సదరు వ్యాపారి, అతని అనుచరులు కార్యకలాపాలు నిలిపివేశారు.

సైకిళ్లతో మొదలై.. గూడ్స్‌ రైళ్లలో తరలించే స్థాయికి..

ఒకప్పుడు గ్రామాల్లో సైకిళ్లపై తిరుగుతూ.. పీడీఎస్‌ బియ్యాన్ని సేకరించి వాహనాల్లో తరలించడంలో ఏక్‌ రూపాయ్‌వాలాది అందెవేసిన చేయి. అప్పట్లో హుజూరాబాద్‌ ఉప ఎన్నిక, ఎమ్మెల్సీ ఎన్నికలు వరుసగా రావడం.. పత్రికల్లో వరుస కథనాలు రావడంతో అతడి వ్యాపారం సుప్తావస్థలోకి వెళ్లింది. ఆ తర్వాత కొత్త పద్ధతిలో వ్యాపారంలోకి దిగాడు. అధికారులకు లంచాలిస్తూ.. మహారాష్ట్రకు బియ్యం తరలించడం కంటే అధికారికంగానే ఎగుమతి చేయాలని నిర్ణయించాడు. అదునుకోసం చూస్తున్న అతడికి తమిళనాడు రాష్ట్రం తెలంగాణ ప్రభుత్వానికి బియ్యం కోసం చేసిన వినతి ఆసరాగా దొరికింది. రూ.37.50కు కిలో చొప్పున కావాలని తమిళనాడు కోరడం.. ఆ డీల్‌ రద్దు కావడంతో 'ఏక్‌ రూపాయ్‌వాలా' రంగంలోకి దిగాడు. కిలో రూ.31.50కే ఇస్తామని డీల్‌ కుదిర్చినట్లు సమాచారం. ఎగుమతికి కావాల్సిన బియ్యంలో తనవంతుగా పీడీఎస్‌ రైస్‌ ఇచ్చేందుకు సిద్ధమయ్యాడు. అతడికి కావాల్సినంత బియ్యం ఇచ్చేందుకు ఉమ్మడి జిల్లాలోని పలువురు రైస్‌మిల్లర్లు కూడా సమ్మతించారని తెలిసింది. ఇందులో కస్టమ్‌ మిల్లింగ్‌ రైస్‌ (సీఎంఆర్‌) బియ్యమే ఉన్నట్లు తెలిసింది. వారం వ్యవధిలో దాదాపు ఐదు వేల టన్నుల బియ్యాన్ని కరీంనగర్‌ నుంచి గూడ్స్‌ ద్వారా ఎగుమతి చేసినట్లు సమాచారం. వీటి విలువ దాదాపు రూ.160కోట్ల వరకు ఉంటుందని సమాచారం. డిమాండ్‌ నేపథ్యంలో మరో రూ.60 కోట్ల విలువైన రెండు వేల టన్నుల బియ్యాన్ని తరలించేందుకు రంగం సిద్ధమైంది. ఇందుకు మరో గూడ్స్‌ రైల్‌ రేక్‌ (కొన్ని బోగీలతో కూడిన రైలు)ను ఇప్పటికే బుక్‌చేశారని సమాచారం. ఇంత జరుగుతుంటే ఇటు సివిల్‌ సప్లయీస్‌ అధికారులు, పోలీసులకు సమాచారం లేకపోవడం గమనార్హం.

అటెన్షన్‌ డైవర్షన్‌లో అందెవేసిన చేయి..

తెలంగాణ, మహారాష్ట్రలో పీడీఎస్‌ బియ్యం అక్రమ రవాణాలో 'ఏక్‌ రూపాయ్‌వాలా'ది అందె వేసిన చేయి. అచ్చం వీరప్పన్‌ తరహాలో.. పోలీసులు బందోబస్తుల్లో నిమగ్నమయ్యే సందర్భాల్లోనే భారీ వాహనాల్లో టన్నుల కొద్దీ బియ్యం రాష్ట్ర సరిహద్దులు దాటిస్తాడు. ఇపుడు బహిరంగ దందా చేస్తున్న నేపథ్యంలోనూ చాలా జాగ్రత్తలు తీసుకున్నాడు. తమపై సివిల్‌ సప్లయీస్‌, పోలీసుల కన్ను పడకుండా.. గణేశ్‌ ఉత్సవాల్లో అధికారులు తలమునకలైన సందర్భాన్ని వాడుకుని రైలు ద్వారా తెలివిగా.. పకడ్బందీగా తమిళనాడుకు బియ్యం ఎగుమతి చేశాడు. త్వరలో ఎన్నికల కోడ్‌ రాబోతోంది. కోడ్‌ వస్తే వాహన తనిఖీలు పెరుగుతాయి. దానికి ముందే రెండో విడత సరుకును పంపేలా ఏర్పాట్లు పూర్తయ్యాయని సమాచారం. కిలోకు రూపాయి బియ్యాన్ని రూ.4 లేదా రూ.5 కమీషన్‌ చొప్పున విక్రయించే 'ఏక్‌ రూపాయ్‌ వాలా' నేడు రూ.వందల కోట్ల వ్యాపారానికి పడగలెత్తిన తీరు సినిమా కథను తలపిస్తోంది.

ఫిర్యాదు వచ్చింది చర్యలు తీసుకుంటాం

కరీంనగర్‌ నుంచి తమిళనాడుకు సీఎంఆర్‌ బియ్యం అక్రమంగా వెళ్తున్నాయని మాకు అధికారికంగా ఫిర్యాదు వచ్చింది. వెంటనే అడిషనల్‌ కలెక్టర్‌, సివిల్‌ సప్లయీస్‌ ఉన్నతాధికారులకు చేరవేశాను. వారు స్పందించి రంగంలోకి దిగారు. అధికారులు ఇచ్చే నివేదిక ఆధారంగా చర్యలు తీసుకుంటాం.

– రవీందర్‌ సింగ్‌, సివిల్‌ సప్లయీస్‌ కార్పొరేషన్‌ చైర్మన్‌

ఫలించిన రైతుల పోరాటం



ఇబ్రహీంపట్నం: క్షీరాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు



సంబరాల్లో బీజేపీ నాయకులు



బాణాసంచా కాలుస్తున్న నాయకులు



ఆందోళన చేస్తున్న రైతులు (ఫైల్‌)

- పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామన్న ప్రధాని మోదీ..
- రైతుల్లో వెల్లువెత్తిన సంతోషం
- జిల్లావ్యాప్తంగా సంబరాలు

జగిత్యాలఅగ్రికల్చర్‌: రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామని ప్రధాని మోదీ ప్రకటించడంపై జిల్లావ్యాప్తంగ రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ఒకప్పుడు బంగారంతో పోటీపడిన పసుపు పంట.. ఇప్పుడు చతికిల పడిపోయి రైతులకు పెట్టుబడి ఖర్చులు కూడా రావడం లేదు. జిల్లాలో ఒకప్పుడు 50 వేల ఎకరాల్లో సాగు చేసిన పంట ఇప్పుడు 15వేల ఎకరాలకు పడిపోయింది. జిల్లాలో అత్యధికంగా పసుపు సాగు చేసే మల్లాపూర్‌, ఇబ్రహీంపట్నం, జగిత్యాల, కోరుట్ల, మెట్‌పల్లి, మేడిపల్లి, కథలాపూర్‌ మండలాల రైతులు పసుపు బోర్డు కోసం అనేక ఉద్యమాలు చేశారు. జగిత్యాల, మెట్‌పల్లిలో రాస్తారోకోలు, ధర్నాలతోపాటు పాదయాత్ర కూడా చేపట్టారు. గత పార్లమెంట్‌ ఎన్నికల్లో పసుపు రైతులు నిజామాబాద్‌ పార్లమెంట్‌ స్థానానికి దాదాపు 300 మంది వరకు పోటీ చేశారు. ఇది దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రైతు ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు, పసుపు రైతుల ఉద్యమ సారథి పన్నాల తిరుపతి రెడ్డి నేతృత్వంలో జిల్లా రైతులే 170 మంది వరకు పోటీ చేసి, తమ వాణిని వినిపించారు. ఆ సమయంలో పసుపు రైతుల సమస్య ఒక్కసారిగా దేశవ్యాప్తంగా వెలుగులోకి వచ్చింది. కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన వారంలోపు పసుపు బోర్డు తెస్తానని బీజేపీ నిజామాబాద్‌ ఎంపీ అభ్యర్థి అర్వింద్‌ బాండ్‌ పేపర్‌ రాసిచ్చారు. అధికారంలోకొచ్చినా దాని ఊసు లేకపోవడంతో రైతులు ఆందోళనలకు దిగారు. వారి పోరాటం ఫలించి.. రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేయనున్నట్లు స్వయంగా ప్రధాని నరేంద్రమోదీ మహబూబ్‌నగర్‌లో ప్రకటించడంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మోదీ చిత్రపటానికి క్షీరాభిషేకం

ఇబ్రహీంపట్నం: పసుపు బోర్డు ఏర్పాటు చేస్తామన్న ప్రధాని మోదీ ప్రకటనపై బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జేఎస్‌.వెంకట్‌ ఆధ్వర్యంలో ప్రధాని, నిజామాబాద్‌ ఎంపీ అర్వింద్‌ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పార్టీ జిల్లా కార్యవర్గ సభ్యుడు తీగల శ్రీధర్‌రెడ్డి, మండల అధ్యక్షుడు జకరయ్య, కిసాన్‌ మోర్చా జిల్లా కార్యవర్గ సభ్యుడు బైన మహేశ్‌, ఉపాధ్యక్షుడు పంతంగి వెంకటేశ్‌యాదవ్‌, మండల కార్యదర్శులు గుండేటి సతీష్‌,దేవన్న, నాయకులు పాల్గొన్నారు.

షుగర్‌ ఫ్యాక్టరీ తెరిపించాలి

మల్లాపూర్‌: ప్రధాని మోదీ ప్రకటనపై చెరుకు ఉత్పత్తిదారుల సంఘం జిల్లా అధ్యక్షుడు మామిడి నారాయణరెడ్డి హర్షం వ్యక్తం చేశారు. మండలంలోని ముత్యంపేట నిజాం షుగర్‌ ఫ్యాక్టరీ వద్ద రైతులతో కలిసి మాట్లాడారు. రాష్ట్రంలోని మూడు నిజాం షుగర్‌ ఫ్యాక్టరీలు తెరిపించేందుకు కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలు ముందుకురావాలని కోరారు. చెరుకు రైతులు గోరుమంతుల ప్రవీణ్‌కుమార్‌, వంగ అశోక్‌, దామ రాజేష్‌, వెల్మల అనంత్‌రెడ్డి, యాల్ల గంగిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పసుపు బోర్డు నిర్ణయం హర్షణీయం

మెట్‌పల్లి: పసుపు బోర్డును ఏర్పాటు చేయడం హర్షణీయమని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలేటి నరేందర్‌రెడ్డి, బ్లాక్‌ కాంగ్రెస్‌ అధ్యక్షులు అల్లూరి మహేందర్‌రెడ్డి వేర్వేరు ప్రకటనల్లో పేర్కొన్నారు.

రాయికల్‌లో సంబరాలు

రాయికల్‌: మోదీ పసుపుబోర్డు ప్రకటించడంపై రాయికల్‌, మండలంలోని ఆలూర్‌లో బీజేపీ నాయకులు సంబరాలు నిర్వహించారు. ప్రధాని, ఎంపీ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కల్లెడ ధర్మపురి, జిల్లా మహిళా అధ్యక్షురాలు సురతాని భాగ్యలక్ష్మి, మచ్చ నారాయణ, గంగారెడ్డి, రాంరెడ్డి, మల్లారెడ్డి, శేఖర్‌రెడ్డి ఉన్నారు.

జిల్లాకేంద్రంలో సంబరాలు

జగిత్యాలటౌన్‌: పసుపు బోర్డు ఏర్పాటు ప్రకటనతో అన్నదాతల్లో ఆత్మవిశ్వాసం పెరిగిందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు భోగ శ్రావణి అన్నారు. జిల్లా కేంద్రంలోని తహసీల్‌ చౌరస్తాలో సంబరాలు నిర్వహించారు. మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో నాయకులు సత్యనారాయణరావు, పన్నాల తిరుపతిరెడ్డి, వీరబత్తిని అనిల్‌, సాంబారి కళావతి, ఆముద రాజు, మమత తదితరులు పాల్గొన్నారు.

అభినందనీయం



రాష్ట్రంలో పసుపు బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు ప్రధాన నరేంద్రమోదీ ప్రకటించడం మా పోరాటాలకు స్ఫూర్తినిచ్చింది. రైతుల పోరాటంతోనే పసుపు బోర్డు ఏర్పాటు కాబోతుంది. జిల్లా రైతులు ఉద్యమాలు చేసి జైలుకు వెళ్లిన సందర్భాలు ఉన్నాయి.

– పన్నాల తిరుపతి రెడ్డి, పసుపు రైతుల ఉద్యమ నాయకుడు

మంత్రి కేటీఆర్‌ పర్యటనకు ఏర్పాట్లు



జగిత్యాల: మంత్రి కేటీఆర్‌ జిల్లాలోని ధర్మపురి, జగిత్యాల నియోజవర్గాల్లో ఈనెల 3న పర్యటిస్తారని, పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభిస్తారని కలెక్టర్‌ యాస్మిన్‌బాషా తెలిపారు. జగిత్యాల పట్టణం నూకపల్లి (మల్యాల మండలం) పరిధిలో రూ.280 కోట్లతో నిర్మించిన డబుల్‌బెడ్‌ రూం ఇళ్లలో మొదటి దశ కింద 3,722 మంది నిరుపేదలకు ఇళ్లు అందిస్తారని, అలాగే జిల్లాకేంద్రంలో రూ.38.4కోట్లతో నిర్మించిన సమీకృత పోలీస్‌ కార్యాలయం భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం జిల్లాకేంద్రంలో నిర్మించిన సమీకృత వెజ్‌, నాన్‌వెజ్‌ మార్కెట్‌ను ప్రారంభిస్తారన్నారు. ధర్మపురిలో మంత్రి కొప్పుల ఈశ్వర్‌తో కలిసి రూ.8.50 కోట్లతో నిర్మించిన మాతాశిశు సంరక్షణ కేంద్రం పైలాన్‌ ప్రారంభిస్తారని, గృహలక్ష్మీ పథకం కింద ప్రొసీడింగ్‌ కాపీలు అందిస్తారని వివరించారు.

టీచర్ల తప్పుల దిద్దుబాటు

- ర్యాంకుల గోల్‌మాల్‌పై స్పందించిన డీఈవోలు
- 'సాక్షి' వరుస కథనాలపై కదలిన విద్యాశాఖ
- స్పౌజ్‌ పాయింట్ల దుర్వినియోగంపైనా మొదలైన చర్యలు
- అన్ని డీఈవో కార్యాలయాల్లో స్పౌజ్‌ ఆప్షన్ల వెరిఫికేషన్లు



వెరిఫికేషన్‌కు హాజరైన స్పౌజ్‌ టీచర్లు

సాక్షి ప్రతినిధి, కరీంనగర్‌: టీచర్ల బదిలీలు, పదోన్నతులు సందర్భంగా వెలుగుచూసిన ర్యాంకుల గోల్‌మాల్‌, స్పౌజ్‌ పాయింట్ల దుర్వినియోగంపై విద్యాశాఖ అధికారులు స్పందించారు. ఇటీవల జీహెచ్‌ఎం బదిలీలలో స్పౌజ్‌ పాయింట్ల దుర్వినియోగం అవుతున్న తీరును, టీచర్ల పదోన్నతులు–బదిలీల సందర్భంగా దరఖాస్తుల్లో డీఎస్సీ ర్యాంకులను తప్పుగా నమోదు చేసిన వైనాన్ని 'సాక్షి' గతనెల 23న 'స్పౌజ్‌ దుర్వినియోగంపై గుర్రు', 29న 'టీచర్ల బదిలీల్లో ర్యాంకుల గోల్‌మాల్‌' శీర్షికలతో వెలుగులోకి తీసుకొచ్చింది. దీంతో టీచర్లు చేసిన తప్పులను సరిదిద్దేందుకు చర్యలు ప్రారంభించారు. ప్రస్తుతం జగిత్యాల, పెద్దపల్లి, కరీంనగర్‌ జిల్లాలో జాబితాలను అధికారులు సవరించారు. సిరిసిల్ల జాబితాను సవరించాల్సి ఉంది.

డీఈవో కార్యాలయాల్లో స్పౌజ్‌ వెరిఫికేషన్‌..

స్పౌజ్‌ పాయింట్ల దుర్వినియోగంపై పాఠశాల డైరెక్టర్‌ దేవసేన ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా అన్ని డీఈఓ కార్యాలయాలు అప్రమత్తమయ్యాయి. స్పౌజ్‌ కింద దరఖాస్తు చేసుకున్న టీచర్లంతా డీఈవో కార్యాలయాల్లో ఆదివారం వెరిఫికేషన్‌కు రావాలని సూచించింది. అందరి ఆప్షన్లను వెరిఫికేషన్‌ చేసి అందులో నిబంధనలకు విరుద్ధంగా స్పౌజ్‌కు దూరంగా ఆప్షన్‌ ఇచ్చినవారందరినీ సమీపంలోని స్కూల్‌కు ఆప్షన్‌ను ఎడిట్‌ చేసుకోవాలని డీఈవోలు ఆదేశించారు. దీంతో అనివార్యంగా వారంతా సమీపంలోని పాఠశాల వద్దకు ఆప్షన్‌ ఇచ్చుకున్నారు. ఇష్టంలేనివారు ×నాట్‌ విల్లింగ్‌₹ ఇచ్చుకున్నారు. కరీంనగర్‌లో 56 మంది, జగిత్యాలలో 66 మంది, పెద్దపల్లి 33 మంది, సిరిసిల్లలో 37 మంది స్పౌజ్‌లు వెరిఫికేషన్‌ పూర్తిచేసుకున్నారు.

గోల్‌మాల్‌ ర్యాంకులు సరి

పదోన్నతులు, బదిలీ సందర్భంగా ఉమ్మడి జిల్లాలోని సిరిసిల్ల, జగిత్యాలలో పలు తప్పులు దొర్లాయి. కొందరు టీచర్లు తాము కోరుకున్న పదోన్నతి, ఇష్టమైన చోటుకు బదిలీ దక్కేలా చక్రం తిప్పారు. 317 జీవో అమలు సందర్భంగా డీఎస్సీ ర్యాంకును ప్రామాణికంగా కేటాయింపులు చేపట్టారు. ఇప్పుడు కూడా అవే ర్యాంకులు ప్రామాణికంగా తీసుకుంటున్నారని తెలుసుకున్న టీచర్లు.. తమ డీఎస్సీ ర్యాంకులను హెచ్‌ఆర్‌ఎంఎస్‌ సైట్‌లో తప్పుగా చూపించారు. ఈ విషయంలో కొన్ని జిల్లాల్లో ఉన్నతాధికారులను విజయవంతంగా తప్పుదోవ పట్టించారు. ఈ పరిణామాలను ×సాక్షి₹ వెలుగులోకి తేవడంతో ఉన్నతాధికారులు సీరియస్‌ అయ్యారు. తప్పుడు ర్యాంకులు చూపిన టీచర్లకు నోటీసులు పంపి వివరణ కోరారు. అలాగే తప్పుగా నమోదైన ర్యాంకులను తిరిగి సరిదిద్దుతున్నారు.

బదిలీలు (గణిత ఉపాధ్యాయుల సీనియారిటీ లిస్టు)

జిల్లా	సీనియారిటీ సంఖ్య	ప్రస్తుత ర్యాంకు	317 జాబితా ర్యాంకు
జగిత్యాల	02	675	2163
జగిత్యాల	25	685	2191
జగిత్యాల	31	334	681

పై పట్టికలో చూపినవే కాకుండా పదుల సంఖ్యలో తప్పుగా నమోదుచేసిన ర్యాంకులను డీఈవో కార్యాలయాలు ఇప్పుడు సరిచేశాయి. 317 జీవో అమలు సందర్భంలో ఉన్న ర్యాంకులనే ఉంచి, వాటినే ప్రామాణికంగా బదిలీలు, పదోన్నతులు చేపట్టనున్నారు. తప్పుడు ర్యాంకులను సవరించి, పాత ర్యాంకులను ప్రామాణికంగా తీసుకుంటున్న జగిత్యాల డీఈవో జగన్మోహన్‌రెడ్డికి ఎస్టీయూ అధ్యక్ష కార్యదర్శులు బైరం హరికిరణ్‌, మచ్చ శంకర్‌ కృతజ్ఞతలు తెలిపారు.

వృద్ధులకు ప్రభుత్వం భరోసా



కలెక్టరేట్‌లో వృద్ధులను సన్మానిస్తున్న కలెక్టర్‌, చిత్రంలో జెడ్పీ చైర్‌పర్సన్‌ దావ వసంత

- జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌
- వృద్ధులకు సన్మానం

జగిత్యాల: వృద్ధులకు భరోసా కల్పించేందుకు సీఎం కేసీఆర్‌ చర్యలు తీసుకుంటున్నారని జగిత్యాల ఎమ్మెల్యే సంజయ్‌కుమార్‌ అన్నారు. అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవం సందర్భంగా కలెక్టరేట్‌లో సీనియర్‌ సిటిజన్లను సత్కరించారు. భావితరాలకు మంచి సమాజాన్ని అందించాలని సూచించారు. నాడు ముచ్చట్లతో కాలక్షేపం చేస్తే.. నేడు పిల్లలు స్మార్ట్‌ ఫోన్లకు అలవాటుపడ్డారని తెలిపారు. వృద్ధులకు సమస్యలు ఉంటే 14567 టోల్‌ఫ్రీ నంబర్‌కు కాల్‌ చేయవచ్చన్నారు. కలెక్టర్‌ యాస్మిన్‌ బాషా, జెడ్పీ చైర్‌పర్సన్‌ దావ వసంత, అదనపు కలెక్టర్‌ లత, జిల్లా సంక్షేమ అధికారి నరేష్‌ తదితరులు ఉన్నారు.

గెలుపోటములను సమానంగా తీసుకోవాలి

గెలుపోటములను సమానంగా తీసుకోవాలని ఎమ్మెల్యే అన్నారు. జిల్లాకేంద్రంలో తైక్వాన్‌ చాంపియన్‌షిప్‌ పోటీలు ప్రారంభించారు. విద్యార్థులు అన్నిరంగాల్లో ముందుండాలన్నారు. ప్రతిభ కనబరిచిన పిల్లలకు పతకాలు అందించారు. జిల్లా తైక్వాండో అసోసియేషన్‌ చైర్మన్‌ మంచాల కృష్ణ, అధ్యక్షుడు గంగారాం, సంతోష్‌ పాల్గొన్నారు.

ఆలయాలకు మహర్దశ..

బీఆర్‌ఎస్‌ పాలనలోనే ఆలయాలకు మహర్దశ వచ్చిందని ఎమ్మెల్యే తెలిపారు. స్థానిక ఆరో వార్డులో ఎస్‌డీఎఫ్‌ నిధులతో చేపడుతున్న దుర్గపీఠ క్షేత్ర నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. సీఎం కేసీఆర్‌ యాదాద్రితోపాటు కొండగట్టు, వేములవాడ, కాళేశ్వరం, దుబ్బ రాజన్న, ధర్మపురి ఆలయాలకు రూ.కోట్లు కేటాయించారని తెలిపారు. దీంతో ఆలయాలకు నూతన శోభ సంతరించుకోనుందని తెలిపారు. మున్సిపల్‌ చైర్మన్‌ గోలి శ్రీనివాస్‌, కౌన్సిలర్‌ ప్రేమలత తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

కెనాల్‌లో కొట్టుకుపోయిన యువకుడి మృతి



మాధవ హరిదగే (ఫైల్)

కోరుట్ల రూరల్: మండలంలోని నాగులపేట శివారు శ్రీరాంసాగర్ కెనాల్‌లో కొట్టుకుపోయిన యువకుడు మృతిచెందాడు. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ కథనం ప్రకారం.. మహారాష్ట్రకు చెందిన మాధవ హరిదగే(20) రెండు రోజుల క్రితం నాగులపేటలో తన బంధువు మృతిచెందడంతో వచ్చాడు. అంత్యక్రియల అనంతరం స్నానం చేసేందుకు కాల్వలో దిగగా, ఈత రాక పోవడంతో కొట్టుకుపోయాడు. బంధువులు గాలించినా దొరకలేదు. ఆదివారం మధ్యాహ్నం రాయికల్ మండలంలోని అల్లీపూర్ వద్ద అతని మృతదేహం స్థానికులకు కనిపించింది. వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో అక్కడికి చేరుకొని, పోస్టుమార్టం చేయించారు. మృతుడి బంధువుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గాయపడిన వ్యక్తి మృతి

- ముగ్గురిపై కేసు

సారంగాపూర్: మండలంలోని పెంబట్ల బుడిగ జంగాల కాలనీకి చెందిన పత్తి రాజు(25) దాడి ఘటనలో గాయపడగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. దాడికి పాల్పడిన ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తిరుపతి తెలిపారు. ఆయన వివరాల ప్రకారం.. గత నెల 12న గ్రామంలో ఉట్టికొట్టే కార్యక్రమం నిర్వహించారు. పాత గొడవలు మనసులో పెట్టుకొని, రాజుపై అదే గ్రామానికి చెందిన పురాణం అర్జున్, రమేశ్, టేకు దుర్గేశ్‌లు దాడి చేయడంతో అతను తీవ్రంగా గాయపడ్డాడు. బాధితుడిని కుటుంబసభ్యులు జగిత్యాలలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ మృతిచెందాడు. మృతుడి భార్య మమత ఫిర్యాదు మేరకు ఆ ముగ్గురిపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

తల్లీబిడ్డలకు ఆరోగ్యమస్తు..!

- ధర్మపురిలో మాతాశిశు ఆస్పత్రి
- అందుబాటులోకి రానున్న ఆరోగ్య సేవలు
- జిల్లా కేంద్రంలో సమీకృత మార్కెట్
- వెజ్, నాన్‌వెజ్, ఫ్లవర్స్ కోసం మూడు రకాల షెడ్లు
- రేపు మంత్రి కేటీఆర్ చేతులమీదుగా ప్రారంభం



ధర్మపురిలో ప్రారంభానికి సిద్ధమైన మాతాశిశు కేంద్రం

ధర్మపురి/జగిత్యాల అగ్రికల్చర్: జిల్లాలోని ధర్మపురిలో నిర్మించిన మాతాశిశు ఆస్పత్రి, జిల్లాకేంద్రంలో సమీకృత మార్కెట్లు అందుబాటులోకి రానున్నాయి. రాష్ట్ర సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ చొరవతో దూరప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం లేకుండా ధర్మపురిలో సకల సౌకర్యాలతో ఆస్పత్రిని నిర్మించారు. ఆసుపత్రిలోని గ్రౌండ్ ఫ్లోర్‌లో మొత్తం ఎనిమిది గదులు ఉన్నాయి. వీటిలో ఓపీ బ్లాక్, ప్రసూతి గది, మత్తు గది, ఈసీజీ, ఎక్స్‌రే, ఆల్ట్రా సౌండ్, గైనకాలజీ గదులు నిర్మించారు. ఫస్ట్‌ఫ్లోర్‌లో మూడు ఆపరేషన్ థియేటర్లు ఏర్పాటు చేశారు. ఆస్పత్రిలోని 50 బెడ్లలో 40 గర్భిణులకు, 10 నవజాత శిశువులకు వినియోగించనున్నారు. మాతాశిశు ఆస్పత్రిని సద్వినియోగం చేసుకోవాలని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో శ్రీనివాస్ కోరారు.

పూర్తయిన సమీకృత మార్కెట్

జిల్లా కేంద్రం శివారులో నిర్మించిన సమీకృత మార్కెట్ పనులను ఒకటి, రెండు రోజుల్లో పూర్తయ్యేలా అధికారులు ప్రయత్నిస్తున్నారు. ఇప్పటికే పలుమార్లు ఎమ్మెల్యే సంజయ్‌కుమార్, కలెక్టర్ యాస్మిన్‌బాషాలు పనులను పరిశీలించారు. జగిత్యాల జిల్లాగా ఏర్పాటయ్యాక జనాభా పెరిగి ట్రాఫిక్ సమస్యలు తలెత్తుతున్నాయి. పైగా కూరగాయాలు, మాంసం, చికెన్, చేపలకు వేర్వేరు ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోంది. అవన్నీ ఒకేచోట లభ్యమయ్యేలా సమీకృత మార్కెట్‌ను ప్రభుత్వం నిర్మించింది. ఇందుకు ధాన్యం మార్కెట్‌కు నాలుగెకారల్లో రెండెకరాలు సమీకృత మార్కెట్‌కు అప్పగించారు. రూ.5 కోట్లతో కూరగాయలు, మాంసం, చేపలు, చికెన్ విక్రయాలకు షెడ్లు నిర్మించారు. ప్రతి షెడ్డులో వంది మంది వరకు ఉత్పత్తులు విక్రయించే అవకాశం ఉంది. షెడ్ల మధ్య భారీ వెలుతురు వచ్చేలా హైమాస్ట్ లైట్లను ఏర్పాటు చేశారు. ఒక్క గేటు నుంచి వచ్చి మరో గేటు ద్వారా వెళ్లేలా రూపొందించారు. ధర్మపురిలోని మాతాశిశు కేంద్రంతోపాటు సమీకృత మార్కెట్‌ను మంగళవారం మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు.



జగిత్యాల సమీకృత మార్కెట్ షెడ్లు

చిరకాల కోరిక



మాతాశిశు ఆస్పత్రి నిర్మాణం నా చిరకాల కోరిక. ఆస్పత్రి నిర్మాణం కావడం ఆనందంగా ఉంది. ముఖ్యమంత్రి కేసీఆర్ పెద్దఎత్తున నిధులు మంజూరు చేశారు. వైద్యం కోసం దూర ప్రాంతాలకు వెళ్లకుండా సకల సౌకర్యాలతో ఆస్పత్రిని నిర్మించడం గర్వంగా ఉంది.

– కొప్పుల ఈశ్వర్, మంత్రి

అన్ని వసతులు ఒకేచోట



ప్రజలకు రోజువారి అవసరాలన్నీ ఒకేచోట లభించేలా సమీకృత మార్కెట్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసింది. రైతులు నేరుగా తెచ్చి సమీకృత మార్కెట్‌లో అమ్ముకోవచ్చు. వినియోగదారులకు తక్కువ రేటుకు ఉత్పత్తులు దొరకుతాయి.

– సంజయ్‌కుమార్, ఎమ్మెల్యే, జగిత్యాల

రైతులకు మేలు



రైతులు పండించిన పంటకు మంచి ధర వస్తుందనే ఉద్దేశంతోనే సమీకృత మార్కెట్ నిర్మాణానికి రెండెకరాలు మార్కెట్ స్థలం ఇచ్చాం. ఏడాదిలోనే పూర్తయి మంత్రి కేటీఆర్ ప్రారంభించనున్నారు. రైతులకు మేలు జరుగుతుంది.

– నక్కల రాధ, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్, జగిత్యాల

ఆరు పథకాలపై ప్రచారం చేయండి

- ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్సీ జీవన్ రెడ్డి

సారంగాపూర్: కాంగ్రెస్ పార్టీ అధినేత్రి సోనియా గాంధీ మన రాష్ట్ర ప్రజల కోసం ప్రకటించిన ఆరు పథకాలపై విస్తృతంగా ప్రచారం చేయాలని ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి కోరారు. ఆదివారం సారంగాపూర్ మండలంలోని రేచపల్లి గ్రామంలో రేచపల్లి, మ్యాడారం తండా, లచ్చనాయక్ తండా, భీంరెడ్డి గూడెం గ్రామాల పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. సోమవారం పెంబట్ల శివారు ఎల్లమ్మ ఆలయం వద్ద సమావేశం నిర్వహించనున్నట్లు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ గతంలో చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పుడు అధికారంలోకి వస్తే చేపట్టే అభివృద్ధి, సంక్షేమ పథకాలపై అవగాహన కల్పించాలని సూచించారు. సోనియాగాంధీ ప్రకటించిన ఆరు గ్యారెంటీ పథకాలు ఇంటికి 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్, రైతు భరోసా కింద ఎకరాకు రూ.15 వేలు, ఇందిరమ్మ ఇళ్ల పథకం కింద రూ.5 లక్షలు, మహాలక్ష్మి పథకం కింద రూ.500కే గ్యాస్ సిలిండర్, మహిళలకు ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణం, కుటుంబంలోని ఒక మహిళకు నెలకు రూ.2,500ను ప్రజల్లోకి తీసుకెళ్లాలని కోరారు. నాయకులు ఎండీ.ఇబ్రహీం, మోత్కూరి ప్రసాద్, కోంద్ర రామచంద్రారెడ్డి, ఆసాది రాజం, మేడిపల్లి ఆనందరెడ్డి, బేర మహేశ్, ఆకుల రాజిరెడ్డి, పాంపర్తి రంజిత్, కర్నె నరసింహారెడ్డి, గోపు శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

దళితులను మోసం చేసిన సీఎం కేసీఆర్

- డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్



కండువా కప్పుతున్న లక్ష్మణ్‌కుమార్

వెల్గటూర్: దళితులకు ఇచ్చిన హామీలను సీఎం కేసీఆర్ విస్మరించారని డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ ఆరోపించారు. ఆదివారం ఎండపల్లి మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన 100 మంది యువకులు కాంగ్రెస్‌లో చేరగా కండువాలు కప్పి, ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. తెలంగాణ ఉద్యమంలో పోరాడిన వారిలో అధిక శాతం దళితులేనన్నారు. ప్రత్యేక రాష్ట్రంలో తొలి ముఖ్యమంత్రిగా దళితుడిని చేస్తానని, దళితులకు మూడెకరాల భూమి ఇస్తానని చెప్పి, మోసం చేశారని మండిపడ్డారు. డబుల్ బెడ్ రూం ఇళ్లు ఇవ్వలేదు గానీ రూ.2 కోట్లతో అధికార భవనం కట్టుకున్నారని ఎద్దేవా చేశారు. ధర్మపురి నియోజకవర్గంలో ఎంతమంది అర్హులకు దళితబంధు సాయం ఇచ్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటయ్యాక సోనియాగాంధీ ప్రకటించిన 6 గ్యారెంటీలను అమలు చేసి, అన్ని వర్గాల ప్రజలకు న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ మండల అధ్యక్షుడు శైలేందర్‌రెడ్డి, యూత్ అధ్యక్షుడు పూదరి రమేశ్, అసెంబ్లీ అధికార ప్రతినిధి విజయ్, గ్రామశాఖ అధ్యక్షుడు శ్రవణ్, నాయకులు గెల్లు శ్రీనివాస్, రమేశ్, మహేశ్, రవి, మల్లేశ్ తదితరులు పాల్గొన్నారు.

మాలలు రాజ్యాధికారం సాధించాలి



నియామక పత్రం ఇస్తున్న ప్రభాకర్

సారంగాపూర్: మాలలు రాజ్యాధికారం సాధించాలని మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు చిత్తారి ప్రభాకర్ అన్నారు. సారంగాపూర్ మండలంలోని రేచపల్లిలో ఆదివారం మాలమహానాడు మండల కార్యవర్గ సమావేశం నిర్వహించారు. వచ్చే ఎన్నికల్లో మాలలు ఐక్యంగా, కార్యాచరణతో ముందుకెళ్లాలని సూచించారు. రేచపల్లికే చెందిన ఆసాది హరీశ్‌ను సారంగాపూర్ మండల అధ్యక్షుడిగా నియమించి, నియామక పత్రం అందించారు. కార్యక్రమంలో యూత్ జిల్లా అధ్యక్షుడు నర్ర రాజేందర్, కార్యదర్శి నక్క సురేశ్, నాయకులు ఎండబెట్ల వరుణ్‌కుమార్, వినయ్, శేఖర్, లక్ష్మణ్, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

మద్యం మత్తులో యువకుడి వీరంగం

వెల్గటూర్: మద్యం మత్తులో ఓ యువకుడు వీరంగం సృష్టించాడు. స్థానికుల వివరాల ప్రకారం.. ఎండపల్లి మండలంలోని పడకల్ గ్రామానికి చెందిన కాలవ్వల సాయికుమార్ అలియాస్ శంకర్ కొత్తపేట వైన్స్‌లో ఆదివారం మద్యం కొనుగోలు చేసి, తాగాడు. తర్వాత మరోసారి మద్యం కోసం వైన్స్ వద్దకు వచ్చి, లోపల ఉన్న బీరు సీసాలు పగులగొట్టి, కౌంటర్‌లో ఉన్న డబ్బులు బయట విసిరేశాడు. దుకాణం బయట ఉన్న బైక్‌ను కెనాల్‌లో పడేశాడు. దుస్తులు మొత్తం విప్పేసి, రెండు చేతుల్లో రెండు బీరుసీసాలు పట్టుకొని, అడ్డువచ్చిన వారిని అసభ్య పదజాలంతో దూషిస్తూ గంటపాటు వీరంగం సృష్టించాడు. సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు అదుపులోకి తీసుకొని, ఇంటివద్ద దింపారు. అతనిపై కేసు నమోదు చేయనున్నట్లు ఎస్‌ఐ శ్వేత తెలిపారు.

సఖ్యత లేక.. సౌకర్యాలు కానరాక

- పాలకమండలి కొలువుదీరి ఐదు నెలలు
- ఇప్పటివరకు సమీక్షలు కరువు
- కొండగట్టు అంజన్న ఆలయంలో అనేక అవకతవకలు
- ప్రశ్నిస్తారనే సమీక్షకు ఈవో నిరాకరణ?



కొండగట్టు ఆలయం

కొండగట్టు: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం కొండగట్టు శ్రీఆంజనేయ స్వామి ఆలయంలో పాలక మండలి కొలువుదీరిన నాటి నుంచి ఇప్పటివరకు ఈవో వెంకటేశ్‌తో సఖ్యత లేదనేది కళ్లకు కట్టినట్లు కనిపిస్తోంది. ఆలయంలో అవకతవకలపై సభ్యులు ప్రశ్నిస్తారనే ఈవో సమీక్షలు నిర్వహించడం లేదన్న ఆరోపణలున్నాయి.

నిబంధనలు ఉల్లంఘించి ఖర్చు..

అంజన్న కొండపై ఈ ఏడాది 08–05–2023న పాలక మండలి కొలువుదీరింది. ఇప్పటివరకు ఒక్కసారే నామమాత్రంగా సమీక్ష నిర్వహించారు. నెలకోసారి జరపాలని చేసిన తీర్మానం అమలు కావడం లేదు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో ఆలయ అధికారులు నిబంధనలు ఉల్లంఘించి, ఖర్చు చేశారని పలువురు సభ్యులు ఆరోపిస్తున్నారు. ఈ అంశంపై తాము నిలదీస్తామన్న ఉద్దేశంతోనే సమీక్షలు నిర్వహించేందుకు ఈవో నిరాకరిస్తున్నారని అంటున్నారు. ఇప్పటికే ఈవో తీరుపై బోర్డు సభ్యులతోపాటు చైర్మన్ దేవాదాయ శాఖ కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు.

అందుబాటులో ఉండరన్న విమర్శలు

ఆలయ ఈవో ప్రతీ మంగళ, శనివారాల్లో భక్తులకు అందుబాటులో ఉండరన్న విమర్శలున్నాయి. నిత్యం ఎవరు పడితేవారు ప్రసాదాలు తయారీ కేంద్రం, కౌంటర్ల నుంచి ప్రసాదాలను ఉచితంగా తీసుకెళ్లడం, నాణ్యత పాటించకుండా కొండకు వచ్చే భక్తులతోనే తయారు చేయిస్తున్నారన్న ఆరోపణలున్నాయి. ప్రొటోకాల్ మరిచి, శాలువాలు, కండువాల పేరిట రూ.లక్షలు వృథా చేయడం, ఓ ఏజెన్సీ ద్వారా నియామకం అయిన ఉద్యోగులు సరిగా విధులు నిర్వహించకపోవడం, ఇటీవల జరిగిన చోరీకి సంబంధించిన సీసీ ఫుటేజీ ఇవ్వాలని బోర్డు సభ్యులు దరఖాస్తు ఇచ్చినా స్పందించకపోవడం, టెండర్లు నిర్వహించి ఇవ్వాల్సిన పనులను నేరుగా ఇవ్వడం, అనంతరం బిల్లులు చెల్లించడం, కాలపరిమితి ముగిసినా సెక్యూరిటీ గార్డులను కొనసాగించడం వంటివి వివాదాస్పదమవుతున్నాయి. సౌకర్యాలు లేక భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఈవోపై అనేక ఫిర్యాదులు వస్తున్నా కమిషనర్ ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని వారు ప్రశ్నిస్తున్నారు. ఆలయ పాలన గాడి తప్పుతున్న నేపథ్యంలో ఈవోను మార్చాలని పాలక మండలి సభ్యులు, భక్తులు కోరుతున్నారు.

ఈవోను మార్చాలి



కొండమీద పాలక మండలి కొలువుదీరిన నాటి నుంచి ఈవో సమీక్షలు నిర్వహించడం లేదు. హనుమాన్ జయంతి ఉత్సవాల్లో బిల్లులు ఇష్టానుసారం చెల్లించారు. మేము ప్రశ్నిస్తామని సమీక్షలు పెట్టడం లేదు. ఈవోను మార్చి, కొత్తవారిని అపాయింట్ చేయాలి.

– పి.ప్రవీణ్‌కుమార్, పాలకమండలి సభ్యుడు, కొండగట్టు

రూ.లక్షలు వృథా



ప్రతీ మంగళ, శనివారాల్లో కొండగట్టు ఆయలంలో భక్తులకు ఈవో అందుబాటులో ఉండటం లేదు. ఇక ప్రసాదాలు, కండువాలు, శాలువల పేరిట రూ.లక్షలు వృథా చేస్తున్నా ఆయన తనకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారు. భక్తులు ఇచ్చే డబ్బులతోనే ఆలయానికి ఆదాయమన్నది గుర్తించాలి.

– కె.రాజశేఖర్, భక్తుడు

ప్రభుత్వం స్పందించాలి



కొండగట్టు ఆలయ పాలకమండలి సభ్యులు, ఈవో మధ్య సఖ్యత లేకుంటే భక్తులకు ఏం సౌకర్యాలు కల్పిస్తారు.. వారి సమస్యలు ఎలా పరిష్కరిస్తారు? ఆలయ అభివృద్ధి మాటేమిటి? ప్రభుత్వం వెంటనే స్పందించి, పరిస్థితిని చక్కదిద్దాలి.

– ముత్యం శంకర్‌గౌడ్, యూత్ కాంగ్రెస్ నియోజకవర్గ అధ్యక్షుడు, చొప్పదండి

పోగొట్టుకున్న సెల్‌ఫోన్ అప్పగింత



ఫోన్ అప్పగిస్తున్న ఎస్సై సతీశ్

పెగడపల్లి: మండలంలోని నామాపూర్‌కు చెందిన సముద్రాల కిరణ్ తన సెల్‌ఫోన్‌ను పోగొట్టుకోగా గుర్తించి, ఆదివారం సాయంత్రం అతనికి అప్పగించినట్లు ఎస్సై సతీశ్ తెలిపారు. ఫిర్యాదు అందగానే సీఈఐఆర్ పోర్టల్‌లో వివరాలు నమోదు చేసి, ఫోన్‌ను గుర్తించినట్లు పేర్కొన్నారు. ఎవరైనా తమ ఫోన్ పోగొట్టున్నా, చోరీకి గురైనా వివరాలను సీఈఐఆర్ పోర్టల్‌లో నమోదు చేస్తే తిరిగి పొందే అవకాశం ఉందని తెలిపారు. ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీలకు ఎంపిక



రామ్‌చరణ్

ఇబ్రహీంపట్నం: మండలంలోని వర్షకొండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏడోతరగతి చదువుతున్న రామ్‌చరణ్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా స్థాయి ఖోఖో పోటీలకు ఎంపికై నట్లు ప్రాధానోపాధ్యాయుడు బి.రాజేందర్ ఆదివారం తెలిపారు. జగిత్యాలలో అండర్–14 విభాగంలో నిర్వహించిన ఖోఖో పోటీల్లో ప్రతిభ కనబరచడంతో ఉమ్మడి జిల్లా స్థాయికి ఎంపికై నట్లు పేర్కొన్నారు. ఈ సందర్భంగా రామ్‌చరణ్‌ను పీడీ కృష్ణ ప్రసాద్, సర్పంచ్ దొంతుల శ్యామల, ఎంపీటీసీ సభ్యుడు పానకంటి వెంకట్, ఉపసర్పంచ్ లక్ష్మణ్, ఉపాధ్యాయులు అభినందించారు.

సిగరెట్లకు వచ్చి.. చంపుతామని బెదిరించారు

- భయంతో యువకుడి ఆత్మహత్య
- నలుగురిపై కేసు

సారంగాపూర్: 'నీ కుటుంబాన్ని చంపేస్తాం'.. అంటూ ముగ్గురు వ్యక్తులు బెదిరించడంతో భయపడిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. సారంగాపూర్ ఎస్సై తిరుపతి కథనం ప్రకారం.. జగిత్యాల రూరల్ మండలంలోని హబ్సీపూర్‌కు చెందిన మాడెం రవికి ఇద్దరు కుమారులున్నారు. అతను గ్రామంలో కిరాణ దుకాణం నిర్వహిస్తున్నాడు. ఈ క్రమంలో గత నెల 28న రాత్రి 11.30 గంటలకు అదే గ్రామానికి చెందిన కారం రాజు, పోడేటి సునీల్, సాయిలు దుకాణానికి వెళ్లగా మూసి ఉంది. తమకు సిగరేట్లు కావాలని ఇంటి తలుపులు కొట్టగా లోపల రవి భార్య ఒక్కతే ఉండటంతో భయపడి తీయలేదు. వారు సలాకలు తీసుకువచ్చి, గేటు పగులగొట్టే ప్రయత్నం చేసి, ఇంటిపై రాళ్లు వేసి, వెళ్లిపోయారు. మరుసటి రోజు బాధిత కుటుంబసభ్యులు ఈ విషయాన్ని గ్రామ పెద్ద మనుషుల దృష్టికి తీసుకెళ్లారు. దీంతో ఆ ముగ్గురూ అదేరోజు రాత్రి మళ్లీ రవి ఇంటికి వెళ్లి, తమను పంచాయితీకి పిలవాలని చూస్తారా అంటూ తలుపులు కొట్టారు. ఈ విషయాన్ని గ్రామంలో ఎవరికైనా చెబితే మీ కుటుంబాన్ని చంపేస్తామని వెళ్లిపోయారు. భయభ్రాంతులకు గురైన రవి 30న తన కుటుంబ సభ్యులతో కలిసి జగిత్యాల రూరల్ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి, ఫిర్యాదు చేశాడు. ఇది తెలిసిన రాజు, సునీల్, సాయి పిటిషన్ వెనక్కి తీసుకోవాలని లేదంటే నీ కుటుంబాన్ని చంపుతామని రవి పెద్ద కుమారుడు శివనాగేశ్వర్‌రావు(21)ను బెదిరించారు. సర్పంచ్ మారు రాజేశ్వర్‌రెడ్డి కూడా పిటిషన్ వాపస్ తీసుకోవాలని రవికి సూచించారు. తమ కుటుంబానికి రక్షణ లేకుండా పోయిందని భయపడిన శివనాగేశ్వర్‌రావు శనివారం మధ్యాహ్నం ఇంటి నుంచి వెళ్లిపోయాడు. కుటుంబసభ్యులు చుట్టుపక్కల వెతికినా ఆచూకీ లభించలేదు. ఆదివారం బట్టపల్లి శివారు అటవీ ప్రాంతంలో అతను చెట్టుకు ఉరేసుకున్నట్లు కుటుంబసభ్యులకు సమాచారం అందింది. భయంతోనే తన కుమారుడు ఆత్మహత్య చేసుకున్నాడని మృతుడి తండ్రి ఫిర్యాదు మేరకు బెదిరించిన ముగ్గురితోపాటు సర్పంచ్‌పై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.

గేదెను ఢీకొట్టిన ద్విచక్రవాహనం

- యువకుడి దుర్మరణం, మరొకరికి తీవ్ర గాయాలు



శరణీత్ మృతదేహం

కోరుట్ల: గేదెను ద్విచక్రవాహనం ఢీకొన్న ఘటనలో ఓ యువకుడు మృతిచెందగా, మరొకరికి తీవ్ర గాయాలయ్యాయి. ఎస్‌ఐ కిరణ్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. కోరుట్ల పట్టణంలోని ఏసికోని గుట్ట కాలనీకి చెందిన గూర్ల శంకర్–మమత దంపతుల కుమారుడు శరణీత్ అలియాస్ పండు (18) నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లోని ఓ నర్సరీలో పని చేస్తున్నాడు. ఆదివారం మధ్యాహ్నం రేషన్ కార్డు ఈ–కేవైసీ కోసం కోరుట్ల వచ్చాడు. సాయంత్రం అదే కాలనీకి చెందిన కన్నూర్ రవితో కలిసి బైక్‌పై బయటకు వెళ్లాడు. రాత్రి 8 గంటల సమయంలో తిరిగి ఇంటికి వస్తుండగా సబ్‌స్టేషన్ వద్ద గేదె అడ్డుగా వచ్చింది. చీకట్లో సరిగా గమనించని శరణీత్ దాన్ని ఢీకొట్టి, ఎగిరిపడ్డాడు. ఈ ప్రమాదంలో అతను అక్కడికక్కడే మృతి చెందగా వెనకాల కూర్చున్న రవి కాళ్లు, చేతులు విరిగాయి. సంఘటన స్థలాన్ని ఎస్‌ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.